# డాక్టర్ ఎ. ఆర్. అబ్బయ్య

అభయ మేమో ఆయన పేరు అన్నది సుశీ.

లేదు లేదు, బల్లమీదున్నదే అసలు పేరు అన్నది శశి.

అంటే యేమిటి?

యేమో

అలా యెలా పెడతారు పేరు?

కబ్బయ్య అని గూడా పెడతారు పేరు. కబ్బయ్య అంటే కపాల కుండలేశ్వరుడు. అబాయ్ అని రష్యన్ పేరున్నది నవలలో చదివాను. ఇటాలియన్ పేరున్నది వటికన్ అనే నవలలో వున్నది.

యేం డాక్టరూ? అని దీర్ఘం తీసింది సుశీ.

ఈ వూరికి కొత్తేమిటి మీరు?

పోనీ అలానే అనుకోండి. దగ్గు వస్తున్నట్టు అనుమానంగా వుంటే ఆపుకోవాలని చూస్తున్న సుశీ అన్నది.

అసలు ఆయన సంగతి మీకెందుకు? యే డాక్టరయితే మీకెందుకు? డాక్టరేట్ వున్నవారినీ డాక్టరంటారు. పిహెచ్‌డి తెచ్చుకున్నాడన్న మాట. ఆచార్య బిరుదన్న మాట. నటులకు, గాయకులకూ గూడా యిస్తారు అకాడమీవారు.

నావంటి వాడొకడు అలాటి బల్ల చూసి లోపలి కెళ్ళాడట. యేం కావాలీ అన్నాడట కుర్చీలో వున్న మనిషి. మందు కావాలి అన్నాడట పల్లెటూరి ఆసామీ, కూచుని తన జబ్బు వివరాలు యేకరువు బెట్టపోయాడట.

నేను మందులిచ్చే డాక్టర్ని కాను అన్నాడట డాక్టరు.

మరి డాక్టరని వున్నదేం బల్లమీద? అనడిగితే

వేదాంతం డాక్టర్ని అన్నాడట డాక్టరు.

పోనీ, అవే నాలుగు ముక్కలు చెప్పు. విని ఫీజిచ్చి వెళ్ళిపోతా అన్నాడట పల్లెటూరి ఆసామి. సుశీ నవ్వసాగింది.

మీరు గూడా అలా ఎక్స్‌పరిమెంట్ చేసి చూడండి. నేనెన్నడూ ఆ యింట్లోకి వెళ్ళలేదు. పరిచయమన్నా లేదు అన్నది శశి.

సుశీ వెళ్ళిపోయింది. బజారుకి వెళ్ళాలి తోడు వస్తారా అని అడగాలని వచ్చింది. అది మరిచిపోయింది.

శశి తలుపు మూసి వచ్చి వంట కంటిన్యూ చేయసాగింది.

## 2

సుశీ! తలుపు తట్టింది చంద్రకాంత.

సుశీ తలుపు తీసి, మీరా! లోపలికి రండి. కరెంట్ పోయి నట్టున్నది. కాలింగ్ బెల్ వినరాలేదే. చాలాసేపైందా వచ్చి అని లోపలికి దారి తీసింది.

చాలాసేపు కాలేదు. ఈమె పేరు కాశీరత్నం. ఒంట్లో బాగ లేదుట. మా పక్క భాగంలోకి కొత్తగా వచ్చారు. తెలిసిన డాక్టరు దగ్గరలో వుంటే తీసికెళ్ళండి. ఒక్కత్తెనే వెళ్ళలేను. తోడు రాగలరా అంటే నువ్వు గుర్తొచ్చావు. ఆ డాక్టరు అబ్బయ్యను

గురించి శశిని అడిగావుట. ఆమెను తీసికెళ్ళి పరిచయం చేసే టైముంటే, యేదో చిన్న సుస్తీ నయం చేసుకోవాలేమో, సుశీని తీసి కెళ్ళు డాక్టరు అబ్బయ్య సర్జరీకి. నాకు బొత్తుగా టైమ్ లేదు అని ఫోన్ చేసింది. మా ఆయన కాంప్ వెళ్ళారు. మీరిద్దరూ వెళ్తారా నేనూ రావాలా? అన్నది నిలబడి.

కూచోండి ముందు.

డ్రాయింగ్ రూమ్‌లో సోఫాల్లో కూచున్నారు పొద్దుటి పూట పదకొండున్నర గంటలైంది. దూరదర్శన్ యేదో పురాణగాధ చూపుతున్నది.

నీళ్ళు కొత్త అయీ సముద్రపు గాలి పడక, జలుబు చేస్తుంది. దగ్గూ పట్టుకుంటుంది కొందరికి అన్నది సుశీ.

నేనదే చెప్తే, అప్పుడే వారమైంది. దగ్గు తగ్గలేదన్నదీమె మాకు బీచీ వేపే వీధి వాకిలి అన్నది చంద్రకాంత.

అదీ విన్నానండి. కన్సల్ట్ చేస్తే నష్టమేమిటి? తెల్లవార్లూ దగ్గుతున్నావని మా ఆయన నస. నిద్ర పోనివ్వవు, డాక్టర్ని కన్సల్ట్ చేయి అని విసుక్కున్నారు అన్నది కాశీరత్నం.

సరే తోడు వస్తాను, చాలాసేపుండలేను, మీరిద్దరూ వుండండి, యెన్ని గంటలకు?

మీకు వీలున్నప్పుడే ఫోన్ చేయండి వచ్చేస్తాం. ఇవాళే అని లేచింది చంద్రకాంత.

3

కన్సల్టేషన్ రూమే అందంగా వున్నది. సర్జరీలాగా లేదు. కర్టెన్సూ అందమైనవే, తుడిచి, దులిపినట్టున్నాయి ఫర్నిచరూ యితర వస్తువులూ, మూలగా అమర్చిన ఫోనూ దానిమీద రుమాలా, సోఫాలకి యెంబ్రాయిడర్ వర్క్ చేసిన కవర్లూ, కిటికీలకి స్ప్రింగ్ లాంటి తాడు దూర్చినట్టు కదలకుండా వుండి వాటిమీద అల్లికలాగా కనబడుతున్నది.

డాక్టరు నవ్వుతూ వచ్చి ఆహ్వానించాడు.

అలా కూచోండి, పత్రికలు చూడటం అలవాటున్నదా? వెయిట్ చేయాల్సి వస్తే విసుగెత్తకుండా కనీసం బొమ్మలైనా చూస్తూ వుంటారని, మీ కోసమే తెప్పిస్తాను. షెల్ఫు గోడకున్నది. ఎగ్జిబిషన్‌లో కొన్నా, హాండ్‌లూమ్, హాండ్‌క్రాఫ్ట్స్ ఎగ్జిబిషన్లు మన వూరు వచ్చాయి, అలా అంటుండగా ఫోన్ మోగింది. పక్క గదిలో కెళ్ళాడు డాక్టరు. ఈ డాక్టరు వేషం వేసుకోలేదు. లేతరంగు పాంటూ, లేతరంగు షర్టూ, చెప్పులూ, తల అందంగా దువ్వుకున్నాడు మనిషి తెలుపు, బొద్దుగా యెముకల నరాలు మొరటిదనం లేని మనిషి. నునుపైన బుగ్గలు, నవ్వుతూ కదుల్తూ మాట్లాడుతాడు. నడకలో కులుకు, ఫోన్‌లో జవాబిచ్చి, వచ్చేప్పుడు చిన్న ట్రేలో చిన్న గాజు గ్లాసుల్లో సాఫ్ట్ డ్రింకులు, లిటిల్ హార్ట్స్ అనే బిస్కట్లు నాలుగు సాసర్లో వుంచి తెచ్చాడు.

కొత్తగా కాపరానికొచ్చిన కోడలులాగా మర్యాదా మైత్రీ చూపుతున్నాడు అనుకున్నది చంద్రకాంత.

తానూ బుద్ధిగా, కుదురుగా ఓ సోఫాలో కూచున్నాడు. ఒకే అద్దంలాగా వున్న కళ్ళద్దాలూ, దాని ఫ్రేమూ మెరుస్తున్నాయి. యుడికొలోన్ వాసన సన్నగా వస్తున్నది. పూలవెట్ల మీదనించి పారుజాతం, లిల్లీ, జాజి వాసనలు వస్తున్నాయి.

నర్సుని యెంగేజ్ చేసుకోలేదండీ యింకా? అనడిగింది సుశీ.

నేనే డ్రింక్స్ సర్వ్ చేశాననా అలా అడుగుతున్నారు? పార్ట్ టైం నర్సుని యెంగేజ్ చేశా. అప్పుడేమో నర్సు కుమారే. గభీక్కున పెళ్ళాడింది. దాంతో ఫామిలీవేలో చివరి దశకొచ్చేసింది. గొణుక్కుండా వస్తూనే వున్నది డ్యూటీకి. నిండు చూలాలు అలా నిలబడి పనిచేస్తుంటే చూడలేక, మెటర్నిటీ లీవిచ్చి పంపేశా. బిడ్డకి అయిదో నెల వచ్చాక రమ్మన్నాను. డ్యూటీ అంటే చాలా గౌరవం, అంతక్కర్లా నెల లోపులే రాగల్ను అని వెళ్ళింది. ఈ పాటికి నీరాడి పస్తెం తిని, లేచి తిరుగుతూ వుండాలి. వచ్చేస్తుంది రేపటి మాపట్లో అన్నాడు.

అందాకా మీరే అన్నీ చూసుకుందామనుకున్నారా? అని చంద్రకాంత నవ్వింది.

అన్నీ అంటే నేను గైనకాలజిస్టునూ గాను పురుడు పోసే ఎక్విప్‌మెంట్సూ లేవు. స్పేర్ రూమూ లేదు, ఒట్టి ఫిజిషన్ని యెవర్నన్నా తెచ్చి ఎడ్మిట్ చేయనా? నెలలు నిండాయా? అని నవ్వుతున్నాడు డాక్టరు.

కాశీరత్నానికి దగ్గు తెర రానే వచ్చింది. దగ్గుతూనే చేయి అడ్డం పెట్టుకుంటూనే కర్చీఫ్ తీసి అన్నది

పురుడు పోయక్కర్లేదు డాక్టర్, గొంతు నెప్పి లేదు గానండీ, ఇలా ఆపకుండా దగ్గు వస్తున్నది. బాధే జలుబూ లేదు, పోనీ కఫమూ రాదు, పొడి దగ్గు, తినలేను, తాగలేను. మళ్ళా దగ్గుతున్నది.

సింపతీ చూపిస్తూ వీపుమీద రాచారిద్దరు మిత్రులూ, కాశీరత్నానికి దగ్గు ఆగింది. అక్కర్లేదండి. రాసినా లాభించదు థాంక్సు. అదే వచ్చి చూపిందెలా తెర వస్తుందో.

యేం చెప్పక్కర్లేదు, తెలిసి పోయింది. మా చెల్లికీ అంటు వ్యాధి అంటుకుంటే మొదట తానే వైద్యం చేసుకున్నది మంద్ర స్వరంలో తాపీగా అన్నాడు డాక్టరు.

యేం వైద్యం చేసుకున్నారు మీ చెల్లి? గొంతులో మందు రాచుకున్నారా అద్దంలో చూసుకుంటూ? అని నవ్వుతూ అడిగింది చంద్రకాంత.

అహఁహఁ అని చక్కగా నవ్వుతూ అందమైన చెయ్యి నరాలు కనబడనిది ఆడించాడు అబ్బయ్య. షర్టు చేయి కిందికి జారి, కఫ్స్ లింక్సు వదులుగా వున్నాయి. చేతి గడియారం దాని మెరిసే బెల్టూ కనిపించాయి.

గాజులు రెండేసి వేసుకోకపోయాడూ ఆ తోలు పటకాకు

బడులు. అడపిల్ల చేయిలాగా యెంత మృదువుగా వున్నదో అనుకున్నది చంద్రకాంత

డాక్టరు కంటిన్యూ చేశాడు. జలుబు అనుకుని, నీళ్ళు పొంగించి పసుపు పొడివేసి, మూత పెట్టి కింద వుంచింది. పైనించి మందపాటి దుప్పటి కప్పుకుని తల మీదిగా రానిచ్చి వంగి మూత తీసింది. ఆవిరికి తగ్గుతుందట. బాదస్తం యేర్పడింది. ఆచారమూ, మూఢ నమ్మకాలు. సూర్యుని చూడనిదీ భోజనం చేయదు. మబ్బేస్తే అని అభినయిస్తున్నాడు.

రాత్రిదాకా అంతే? రాత్రికో? అని నవ్వింది సుశీ.

మినపరొట్టీ, అరటిపండు, మజ్జిగా. బ్రెడ్ పేరెత్తరాదు. అది తయారు చేసేప్పుడు కల్లు కలుపుతారట విన్నదట కల్లు తాగినట్టేట. చేసేవారు మడి గట్టరుట, తడిబట్ట కట్టరాదు. అది మడి గాదంటే పిల్లలు తాకుతారంటుంది, వుపవాసాలవల్ల యెనీమియా వస్తుందంటే జబ్బుపడాల్సి వుంటే యెలాగో వస్తుంది అంటుంది.

నేను మళ్ళా వస్తా కాశీరత్నం అని లేచి వెళ్ళింది సుశీ.

సూదిమందు వేయించుకోవాలా డాక్టర్! ఆ సిరెంజ్ చూస్తేనే నాకు భయం అన్నది కాశీరత్నం.

అక్కర్లేదు. ఆ దగ్గు కంటే జి యస్. మూడు నెలలుంటుంది. ఉపశమనానికే మందు. అది వుండదలచినన్నాళ్ళూ వుండి వదిలేసి వెళ్ళిపోతుంది. మీరు మీ బంధువులనో ఫ్రెండ్సునో చూడ వెళ్ళి

వుంటారు. వారా సమయానికి దగ్గుతూ వుండి వుండాలి. గుర్తు చేసుకోండి. అప్పుడు మిమ్మల్ని ఆ దగ్గు పట్టుకుని వుంటుంది. వారు కర్చీఫ్‌గాని, చేయిగాని అడ్డు పెట్టుకుని వుండరు. మా అమ్మ చేసిన తప్పే అదీ. తన మేనత్త కొడుకు జబ్బుపడి మంచంలో వున్నాడని విని చూడ వెళ్ళింది. మేనత్త కొడుక్కు టిబి నేను విని వున్నాను. వెళ్లకు నిన్ను పట్టుకుంటుంది అంటే విదిలించి కొట్టి వెళ్లింది, ఆ మేనత్తే నన్ను పెంచింది. బావను చూసి రావద్దా అదేం సలహా? అని వెళ్లింది ఏకాదశి వుపవాసం చేసిన మనిషి వెళ్లింది. రెండోరోజు వచ్చిందిగానీ ఆ జబ్బు మా అమ్మని పట్టేసింది. నేనూహించినట్టే ఆ డెడ్లీ డిసీజ్ అంటుకున్నాదే అని విచారం వేసింది. దాన్ని నయం చేసేప్పటికి నా హతమారింది. డబ్బా వదిలింది. మా నాన్నే ఆపలేకపోయాడు ఆ రోజున. ఆయనా అంతే అమ్మనాడిపోసుకోటం దండగ అని నవ్వాడు డాక్టరు.

చంద్రకాంత అడిగింది. ఆయనకూ అంటుకున్నాదీ?

అహహ — మా నాన్నకి కుడి మోకాలులో ఆర్థ్రైటిస్ వచ్చింది. కరెంటు పెట్టించుకుంటే నయమౌతుందని తెలిసిన వైద్యుడన్నాడట. వైద్యుడు ప్రైవేట్ ప్రాక్టీషనర్ మతి కొద్దిగా చలించింది. వార్త అందగానే వెళ్లానింటికి.

కరెంట్ పెట్టించుకోరాదు, నరాలు తెగిపోతాయి. కాలు పనికిరాకుండా పోతుందని చెప్పాను. నన్ను యెద్దేవా చేసి, నిన్న మొన్న డిగ్రీ తెచ్చుకున్నవాడివి. నీకేపాటి తెలుసు. ఆ వైద్యు

డనుభవమున్నవాడు. యెందరికో నయం జేశాడు అని కసిరాడు. నేను వూళ్లో లేనప్పుడు, యెవరూ చూడకుండా వెళ్లి ట్రీట్‌మెంట్ తీసుకున్నాడు మా నాన్న కదుల్తూ నవ్వుతున్నాడు.

యేమైంది? అని ఆదుర్దాగా అడిగారిద్దరు శ్రోతలు.

చెప్తా, చెప్తా. మీరిద్దరూ అవి పూర్తి చేయండి. మీ ఫ్రెం డెందుకో వెళ్లిపోయారు అంటుండగా ఫోన్ మోగింది. పక్కగదిలో కెళ్లాడు డాక్టరు అబ్బయ్య.

దగ్గొస్తుందేమో దగ్గలేను అంటున్నది కాశీరత్నం.

వీళ్లు కనబడేచోటే వున్నాడు, విన్నట్టున్నాడు.

రాదు రాదు వచ్చినా నే కంట్రోల్ చేస్తా అని చెయ్యి వూపుతూ సంజ్ఞలు చేశాడు, వింటున్నాడు. ఆ యిద్దరివంకే చూస్తూ వింటున్నాడు, నవ్వుతున్నాడు.

తీసుకోండి అంటూ చంద్రకాంత తన గ్లాసు అందుకున్నది. వెరుస్తూ వెరుస్తూ రెండు గుటకలేసింది కాశీరత్నం.

వచ్చేశారేం? అన్నది చంద్రకాంత.

ఫాక్సు రిలీజ్ అవుతుందని చెప్పారంతే, అక్కడుండక్క ర్లేదు. నేను చెప్పినంతా అయింది. మా నాన్న కాలు పడిపోయింది. దిగులుపడి మంచాన పడ్డాడు. చెపితే వింటేనా?

ఇహ అక్కడ నించి చేసేవాళ్లు లేక, మా అమ్మ చేయలేక. మనిషిని పెట్టాము. వాడు మంచి మనిషి. ఈయనకేమో బాదస్తం,

కులభేదమనీ స్నానం చేయడవీ నస, అది వినలేక వాడిచేత స్నానం చేయించి, మడి గట్టించి చేయించాల్సి వచ్చింది లేదా నేను చేయాలి. మా అమ్మ తడిబట్టతో చేసేది. ఆమె కాళ్లు పుచ్చి, చర్మం చిట్లింది, పౌడరు వాడమని నైసిల్ కొనిస్తే, అదంతా ఒక గిన్నె లోకి వంచి, అడుగున చిల్లులేసి, మట్టిపోసి చిన్న తులసిమొక్క వేసి, నీళ్లు పోసి వంటింట్లో కిటికీలో పెట్టుకున్నది. అక్కడే పూజ, మెట్లు దిగి దొడ్లోకెళ్లి తులసిపూజ చేయక్కర్లేదుట, సంతోషించింది.

డాక్టరు అభినయం చూస్తున్న కాశీరత్నానికి నవ్వటం వల్ల దగ్గుతెర రానే వచ్చింది ఆపుకుంటూ దగ్గుతూ తడి అయిన కళ్లతో చూస్తూ అన్నది.

మీరు కరెక్ట్‌గా చెప్పారు డాక్టర్. నా తోడుకోడలు చేసుకో లేక అవస్థ పడుతున్నదని తెలిసి, సాయపడదామని వెళ్లానండి, నేనున్నా నాల్రోజులూ నా తోడుకోడలు దగ్గుతూనే వున్నది. వచ్చేశావా? నాలుగోనాడే నాకు పట్టుకున్నాదండీ దగ్గు. పెద్ద కర్చీఫ్ నోటికడ్డం పెట్టుకున్నది,

భయపడకండి, ఆ సర్జరీలోకి రండిద్దరూ. మందువేసి నీళ్ళ గ్లాసిస్తా, పుక్కిలించి బేసిన్‌లో వుమ్మేస్తే కంట్రోల్ అవుతుంది. చేతనైతే తలెత్తి గార్గిల్ చేయాలి,

వాళ్ళిద్దరూ డాక్టర్ని అనుసరించారు.

గ్లాసులో నీళ్ళు పోసి పిప్పెట్‌తో మందు పీల్చి వేళ్ తో మూసి

తెచ్చి, మందుచుక్కలు గ్లాసునీళ్ళలో వదిలాడు. గ్లాసులో గాజుపుల్ల వుంచి తిప్పి తీసేసి కాశీరత్నానికందించాడు గ్లాసు. బల్లమీద బేసిన్ చూపాడు.

కానీండి, ట్రై చేయండి, టాబ్లెట్ యిస్తా చప్పరిద్దురు గాని అంటూ వెళ్ళాడు. పేషంట్సు వచ్చారు. కూచోమని కుర్చీలు చూపాడు.

ఇద్దరి కంప్లెయింట్స్ విని ప్రిస్క్రిప్షన్ రాసి యిచ్చాడు. ఇద్దరు ప్యాకెట్సు యిచ్చారు. దానిలోనే యింజెక్షన్ సిరెంజీ వుంటాయి. ఆ పనైంది. వారు వెళ్ళిపోయారు.

ఇంకా యిద్దరు కూచుని వున్నారు. బంధువులేమో ఒకాయన నవ్వుతూ అడిగాడు. పెళ్ళికి శుభలేఖ పంపారా మీ చెల్లీ బావాసూ?

ఆ పంపారు, మొదటినించీ నా ప్రాణాలు కొరుక్కుతిన్నారు చెపితే అర్థం చేసుకోరూ. ఇప్పుడే యేం పెళ్ళీ బుల్లెమ్మకూ? వట్టి పిచ్చి పిల్ల. పద్దెనిమిదేళ్ళు రావాలి అంటే వూదరపెట్టారు. పోనీ గదా అని సంబంధం చూపిస్తే పల్లెటూర్లో వున్నాం పెళ్ళి చేసేయాలి పెద్ద అయితే వెలి వేస్తారు. వత్తిడి తెచ్చి నిశ్చయ తాంబూలాలు పుచ్చుకోటానికి తీసుకురా వియ్యాలవారిని అని వుత్తరం మీద వుత్తరం పడేశారు. యేదో సామెత వున్నదే అని నవ్వుతున్నాడు. కళ్ళజోడు మెరుస్తున్నది.

రెండో ఆయన అడిగాడు. మీ అన్న కూతుర్ని అత్తారింటికి పంపమని తొందరపెడుతున్నారటగా అత్తారు. శోభనం జరిపారా?

ఆ ముచ్చటా నాదాకా వచ్చింది. నే వెళ్ళి ఆ వియ్యాల వారిని బెదిరించి హడలగొట్టే తగ్గారు. పద్దెనిమిదేళ్లు నిండాలి మా అమ్మాయికి, బలవంతంగా తీసికెళ్లావా నిన్ను జైల్లో పెట్టిస్తా అన్నాను అల్లుడితో. డానికింకా సరిగా చీర కట్టుకోటమే రాదు. పాంటూ షర్టూ అలవాటు దానికి సిటీలో పెరిగింది టేబిల్ మీల్సు అలవాటు. అత్తారి అలవాట్లు బొత్తిగా విరుద్ధం. తగని ఆచారం. గోచీపోసి చీర కట్టారట, దానికి రాదు, బాబ్స్ జుట్టుపెంచి చుట్టు చుట్టాలిట లేదా ముడి వేసుకోవాలిట. ఆ శోభనం తతంగం వాళ్లే వచ్చి చేసుకెళ్లారుట మంత్రపూర్వకంగా శాస్త్రీయంగా ఆ కబురు నాకందలేదు. మా అమ్మాయికి మెరిట్ స్కాలర్‌షిప్ వచ్చి, ఇంటర్లో రాంకొచ్చింది. మెడిసిన్‌లో సీటొస్తుంది చదువుతానంటుంది. ఎం ట్రెన్స్ రాస్తానంటుంది. దాని ఘోష వినే వారెవరు? పొలాలు బాంక్‌లో నిల్వలూ చూసి పెళ్లి కానిచ్చారు అంటూ నవ్వుతున్నాడు.

మొదటే అవన్నీ ఒప్పందం చేసుకోలేదూ?

గొప్ప సంబంధమైపొయె, వరుడేమో చేసుకుంటే వాళ్లమ్మాయినే చేసుకుంటా లేదా సన్యసిస్తా అని మంకుపట్టుపడితే తల్లి దండ్రులు భయపడిపోయి, మధ్యవర్తులచేత చెప్పించి, మెడలు వంచి, పెళ్ళి ఘనంగా చేస్తే చాలుననీ కట్నం లాంఛనాలూ అక్కర్లేదన్నారని పొంగిపోయి, హడావుడిగా మంచి ముహూర్తం చూడమని

పురోహితుడిని పిలిపించి లగ్గం పెట్టింపి, నాకు వైరిచ్చారు. వెళ్లాను. ఆహ్వాన పత్రికలు అచ్చొత్తించి పోస్టు చేయమన్నారు.

అందులో యేదో మోసమున్నదనలేదు నువ్వు అబ్బయ్య బావా? అన్నాడొక బంధువు.

అనకేం అన్నా. నేను నాస్తీకుడిననీ, అన్నిటికీ అడ్డుపుల్ల వేస్తాననీ అప్పుడే కితాబిచ్చారు నాకు మావాళ్ల అని నవ్వుతున్నాడు.

అందులో కొంత విజమున్నాదేమో అబ్బయ్య బావా. మరో అన్న కొడుకు పెళ్లికీ అలాగే అడ్డుపుల్ల వేయటమే గాక వెకవెకా లాడావని విన్నా. పెళ్లేమో జరిగిందనుకో. రెండోబంధువూ నవ్వు తున్నాడు.

వెకచకాలాడలేదు నేను. మా అబ్బాయికి ఆడపిల్లతో మాట్లా డటమే రాదు. సిగ్గు, వాళ్లే పలకరించి కబుర్లాడాలని చూస్తే తలొం చుకు జవాబిస్తాడు ఆడపిల్లలాగా. వాడికి పెళ్లామంటే వూహే లేదు. ధోవతీ కట్టటమే రాదు. నిక్కరూ చొక్కా వేసుకుంటాడు. తల్లే, కంట్లోకి నురగపడకుండా రుమాలా అడ్డుంచి తలంటుపోయాలి. షాంపూ వాడుకోటం రాదు. కూచోండి వెళ్లొద్దు, ఫోనూ పేపంట్నూ అ గదిలో చూసి వస్తా అని కులుకుతూ లేచాడు. గూళ్లు యిటూ అటూ కదిలిస్తూ వెళ్లాడు.

వెనకనించి బావ గాబోలు సరసానికంటున్నాడు.

అలా కులుకుతూ వెళ్తే మగవాడు భ్రమలు పెంచుకుని ప్రపోజ్ వేయచ్చురా అబ్బయ్యా.

డాక్టర్ నవ్వుతూ వెనక్కి చూశాడు. కాశీరత్నానికి మంచినీళ్ల గ్లాసు అందించాడు.

ఇది గూడా గార్గిల్ చేయాలి. తాగటానిక్కాదు. ఇదుగో టాబ్లెట్. బుగ్గన పెట్టుకోండి అంత వుధృతంగా రాదు దగ్గు.

ఫోన్ అందుకున్నాడు. అఁ అఁ. నేనే సుధాకర్! పేరంటమా? పిల్లకి మిమ్మిలి తొక్కలా. నావద్ద ఆ పని చేసేవారు లేరే, నేనే రావాలా? ఫరవాలేదా? యింకా నావంటివాళ్లు వస్తారా? భోజనం గూడానా, సరే వస్తా.

వెళ్లే డాక్టరువేపే చూశారిద్దరూ.

ఒడుగూ ఆపేశావన్నారే? కంటిన్యూ చేశాడు బంధువు.

ఆపేయలేదు. తిరుపతి వెళ్లి దేవుని సన్నిధానంలో చేయాలా డబ్బు దండగ, ఆ రెండో వాడింకా నోట్లో వేలేసుకుని చీకుతూనే వున్నాడు, తల్లి కొంగు వదల్లేదు అన్నాను. వాడికి సంధ్యా వందనం, దాని ప్రొసీజరూ, గాయత్రీ ప్రాణేన్సే చేయటం గుర్తుంటుందా. తెలియక పవిత్రమైన జంధ్యం తీసి యెవరి మెళ్ళోనన్నా వేస్తాడేమో, లేదా చెట్టు కొమ్మకి వేస్తాడేమో. ఆ మంత్రం తక్కిన క్లాసుమేట్సుకీ చెపుతాడేమో. వెనుకటికి రామానుజుడు నారాయణ మంత్రం అందరికీ నేర్పాడట. ఆంధ్రా మిల్టనేమో గాయత్రి మంత్రం అలాగే నేర్పాడట. యెనిమిదో యేడేట మిల్టన్‌కి, అనంగానే మళ్ళా వాగ్యుద్ధం బిగినైంది అని నవ్వుతున్నాడు కుర్చీలో కూచున్న డాక్టరు.

పెళ్ళీడొచ్చిందని విన్నామే, రెండోచుట్టం అన్నాడు,

వచ్చిందనుకునే వో పిల్లవాడితో తిరుగుతూ. దాన్ని విరగడ చేసుకోటం చాతకాక నాతో చెప్పుకున్నాడు. నీ ఫ్రెండుకి అంటించు అని సలహా యిచ్చాను. వాడికి టోకరా వేయటమూ రాదు కుయుక్తులూ రావు, పిచ్చి సన్నాసి. అబద్ధాలాడటం అసలే యెరగడు, నేనే కలగజేసుకుని ఓ గడుసు పిల్లను కనుముక్కు తీరున్న దాని పిల్లనివ్వండి అని నిశ్చయ తాంబూలాలిప్పించి దీనికెంత మంచి సంబంధం కుదిరిందే అని ఆ పిల్ల అప్పులు అసూయ పడ్డారు. మాటలకన్న అభినయం యింకా ముచ్చట గొలిపింది కాశీరత్నానికీ చంద్రకాంతకీ. టైమ్ చూసుకోలేదు.

పొద్దూకి దీపాలు వెలిగినై. డాక్టర్లేచి దీపాలు వేసి దణ్ణంపెట్టి చెంపలేసుకున్నాడు, అతిథులు వెళ్ళిపోయారు.

అబ్బయ్య వచ్చి వీళ్ళిద్దర్ని రమ్మని, కన్సల్టేషన్ రూమ్‌లో కుర్చీలలో కూచోమన్నాడు.

థాంక్స్ డాక్టర్. త్వరగా కంట్రోల్ చేశారు. టెస్టులు చేయించుకోవాలా? అదొక బోరు అని కాశీరత్నం దణ్ణం పెట్టింది.

అక్కర్లేదు. మొదటే చెప్పాగా ఆ దగ్గు తానుండదలుచుకున్నన్నినాళ్ళూ వుండి వదిలిపోతుందనీ, మీకు దుగ్ధ తీర్చుకోవాలనుంటే నేనే దగ్గరుండి చేయిస్తా టెస్టులు. వెంటనే రిపోర్టులూ యిస్తారు టెక్నీషియన్స్. రెండు బ్లాక్, అవతలున్నది లాబ్ నాదే, ఓ నర్సు గూడా వున్నాదక్కడ. పార్ట్ టైమ్ జాబ్ కావాలన్నది.

ఎంగేజ్ చేయగానే జాయినంది. పెద్ద కుటుంబంట. వీలైనంత సంపాయించాలని ఆశయంట. ఆ జీతంతో ఆమె ఓ ఆటో కొన గలిగింది. లోనూ తెచ్చిందిట బాంకునుంచి. అది అద్దెకిస్తుంది. ఆటో డ్రైవరు ఖాళీగా వున్నప్పుడీమెని లాబ్‌కి తొక్కుతాడు. యే రోజు అద్దె ఆ రోజు పుచ్చుకుంటుందిట. చెప్పింది.

వెళ్ళాలని లేక, డాక్టరు అభినయమూ మాటలూ యింకాసేపు వినాలనీ చూడాలనీ వుండి అడిగింది కాశీరత్నం.

మీరు హెూమియోపతి వైద్యం గూడా చేస్తారా?

చేస్తా. చేస్తా. అది కావాలంటే ఆ మందులే వాడదాం. కాని అది మంచి రిజల్ట్సు యివ్వదు. నా కజిన్‌కి జాండిస్ వచ్చింది. ఆమె నన్ను కన్సల్ట్ చేయక యెవరో సలహా యిస్తే హెూమియో డాక్టర్ని ఆశ్రయించింది. తీవ్రమైంది. శోకాలు పెడుతూ అప్పుడు నన్ను పట్టుకున్నది. నా పిల్లలేమౌతారో. బిడ్డల తల్లిని. బతికించవా? అన్నది. అది మూడు నెలలుండి తగ్గిపోతుంది. కంట్రోల్ చేద్దాము, భయం లేదు, యేడవకు అని ఓదార్చి ఆ వైద్యాం మాన్పించి కంట్రోల్ చేశాను. దాయాది తమ్ముడూ అంతే డయాబిటిస్ వస్తే మందు డయట్ చూసుకోక హెూమియోతో పూర్తిగా క్యూర్ అవుతుందని విని నమ్మి, డయట్ అబ్జర్వ్ చేయక అన్నీ అరగిస్తూనే వెళ్ళాడు. ప్రాణం మీదికొచ్చింది. తెల్లారు జామున వచ్చి నన్ను పట్టుకుని యేడిచింది వాడి పెళ్ళాం. తప్పుతుందా తమ్ముడైపాయె. వెళ్ళి ప్రాణాలు నిలబెట్టి, రాగులు, జొన్నలూ గంజిలాగా తయారుచేసి ఆహారంగా తీసుకోమనీ, మజ్జిగ తాగమనీ,

తీసి సరుకు ముట్టుకోవద్దనీ, అన్నం మానేస్తే మంచిదనీ డయట్ చూసుకోటం నేర్పి వచ్చేశాను. మీకు కావాలంటే ఆ వైద్యమే చేయించుకోండి, కాని యేడుస్తూ రావద్దు అని కదుల్తూ నవ్వాడు.

కాశీరత్నం నవ్వింది. చంద్రికాంత నవ్వగూడదని కళ్లతో వారించింది గానీ ఆమెకూ నవ్వు వస్తున్నది.

ఫీజు యిస్తాను, టాబ్లెట్ పేరూ, గార్గల్ చేసిన మందు పేరూ రాసివ్వరూ? వాడుకుంటాను. మా ఆయనకి సింపతీ లేదు. ఆప కుండా దగ్గుతుంటే విసుక్కుంటారు అని పర్స్ బటన్ నొక్కింది కాశీరత్నం.

టేబిల్ మీది పెన్నూ ప్రిస్క్రిప్షన్ వ్రాసిచ్చే పుస్తకం అందు కున్నాడు. వంగి రాస్తూ, పేరు? అన్నాడు.

నుసుపైన చెంపలు, బుగ్గలు మొహం చూస్తూ లేడీ డాక్టరల్లే వున్నాడు సరిగ్గా అనుకుంటూ

కాశీ అని ఆపేసి నవ్వింది చంద్రికాంత.

కాశీయా? గంగానా? వూరిపేరా పెట్టుకున్నారు, పవిత్ర స్థలమనా అని పేరు రాస్తూ నవ్వాడు.

వాళ్ళాయన ముద్దుగా అలా పిలుస్తాడు. పూర్తి పేరు కాశీ రత్నం అన్నది చంద్రికాంత.

ప్రిస్క్రిప్షన్ అందిస్తూ అన్నాడు, కాశీరత్నం, గంగారత్న మని నా క్లాస్‌మేట్సుండేవారు మెడిసిన్ చదివేప్పుడు, హ్యూమర్లేదు,

సరసమసలే యెరగరు వాళ్ళిద్దరూ. టకటకా పాసై, డిగ్రీ, మాస్టర్ డిగ్రీ, డిప్లోమా జాబ్. వెంటనే పడిపాయె చెడిపాయె అని ప్రైవేట్ ప్రాక్టీసూ బిగిన్ చేశారు. బిజీగా వుంటారు. మొగుడు లేడు సరి కదా బోయ్‌ఫ్రెండన్నా లేడు. అసహ్యంట. అంతా బ్రూట్సుట. నేను బ్రూట్‌ని కాదండీ, సరసుడినే అన్నాను. దాంతో వాళ్ళిద్దరూ పెడర్థం తీసి కొట్టినంత పని చేశారు. పోనీ బాది వదుల్తారేమో యెంజాయ్ చేద్దామనుకున్నాను, అబ్బే! ప్చ్, ప్యూన్ని పిలిచి డ్రైవర్ని పిలిచి యీ ఆడంగిరేకుల అబ్బయ్యని నర్సింగ్ హోమ్‌లో ఎడ్మిట్ చేసి రండిద్దరూ. టూమచ్ చనవు, యివ్వకుండానే తీసుకుంటున్నాడు. సరసుడినంటున్నాడు. బుజువు చేసేట్టున్నాడు అని వురిమారు. వెంటనే వాళ్ళిద్దరూ తమ మేడమ్ ఆర్డర్స్ అమలు చేశారు. నా జబ్బలు పట్టుకుని కార్లో దూర్చి ఎడ్మిట్ చేసి వెళ్ళిపోయారు. మరోసారి యెయిర్‌పోర్టులో తారసపడ్డాం. వాళ్ళు నవ్వితే చూడాలనిపించి అన్నాను.

పిల్లా పాపా, మొగుడూ ముద్దులూ సద్దా? చేదా? వాళ్ళేం పాపం చేశారు?

వాళ్ళిద్దరూ నవ్వకపోగా కళ్ళు పెద్దవిచేసి మోటుగా జవాబిచ్చారు అని కదిలిపోతూ నవ్వాడు.

యేమని జవాబిచ్చారు? అనడిగారిద్దరూ ఒక్కసారే.

నిజమైన మగవాడేడీ? ఆడంగిలాగా కులుకుతూ మాట్లాడుతూ ముక్కు చీదుతూ తలొంచుకుని ప్రపోజ్ చేస్తాడొకడు. తల్లి

పాటు బిడ్డ మరొకడు ప్రపోజ్ చేయలేడట. లెటర్స్ రాసుకుందామా అని వెల్లడించాడు మరో సుకుమార బాలా కుమారుడు విరహంతో మంచాన పడ్డాడు. వాళ్ళ నాన్నగారొచ్చి, మీ మీది విరహంతో మంచాన బడ్డాడు నా బిడ్డకి యేది దారి? అని తల్లడిల్లితే మేమే గంగిగోవులాంటి ముద్దరాల్ని యిప్పించి పెళ్లి చేయించి ఆ బాలా కుమారుడి రోగం క్యూర్ చేశాము అన్నారు.

మగవాడంటే మీ డెఫినిషనేమిటి? అని అడిగాను.

తప్పు ప్రూఫ్ కాగానే తల్లి యేదీ తండ్రి యేడీ, నికర యేదీ మేము చూస్తుండగా పురి దీయించాలి, అంతే, సాధువాదం ఒప్పుకోం అన్నారు ఖరాఖండిగా.

అలా చేస్తే కటకటాల వెనక్కి పోడూ మగవాడు!

దానికి సిద్ధమయే మగడు రావాలి. మీ కులుకూ, నవ్వూ, సాధువాదం, ఆడదాని సంభాషణా చూస్తుంటే మీ పేరు మార్చి ఎ. ఆర్ అబ్బయ్య అని బల్ల కట్టించాలని మా అభిప్రాయం అని ఆఫీసర్లు మొహాలు పెట్టి కారు తోలుకుంటూ వెళ్లిపోయారు అని నవ్వసాగాడు.

వాళ్ల ఆశయం అభిప్రాయం విని చంద్రకాంత, కాశీరత్నం గూడా నవ్వసాగారు;

పెళ్లాం నగలు ఒలిచి తీసుకుని థియేటర్ కట్టించి చలన చిత్రాలు చూపేవాడు మొగుడుగా పనికి వస్తాడేమో, నా పినతండ్రి

కొడుకలాగే చేశాడు. ఆ మరదలు శారదకి వాళ్లమ్మే ఆ నగలన్నీ దిగేసింది. మగడు గాదు. ఇంకా రకరకాలుగా మగడినని ప్రూవ్ చేసేవాళ్లున్నారు మా వాళ్లలో. బాది ఒదిలిపెట్టేవాడొకడు. కు. ని అమలు చేయక ప్రతి యేడూ కడుపు పంట పండించేవాడు మరొక మగడు అని నవ్వుతున్నాడు. ఆవకాయలో పాళ్లు చెప్పేవాడు మగడు కాదేమో దగ్గు తెర రాలేదు డాక్టర్. థాంక్స్. కబుర్లతోనే నా దగ్గు కంట్రోల్ చేయగలిగినట్టున్నారు. మీరిచ్చిన ప్రిస్క్రిప్షన్ ఫాలో అవుతాను. మళ్లా వస్తాం డాక్టర్ అని ఫీజు బల్లమీదుంచి లేచింది కాశీరత్నం, చంద్రకాంతా నవ్వుతూ లేచింది.

మీ కంపెనీ వల్ల మనస్సు తేలిక పడుతుంది డాక్టర్ అన్నది.

నేను వాళ్లన్నట్టున్నానా? మగాడల్లే లేసూ?

ఉన్నారు. ఉన్నారు, సరసుడల్లే వున్నారు డాక్టర్. వాళ్లకి మానర్సు లేవు అందంగా మాట్లాడటం రాదని తేలింది అన్నారు కాశీరత్నం, చంద్రకాంతం.

[] [] []